శిక్షణను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో బాలికల సంరక్షణ అధికారి మాలతి, తదితరులు

● జీసీడీఓ మాలతి

పూసపాటిరేగ: విద్యార్థులు వృత్తివిద్యా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలికల సంరక్షణ అధికారి మాలతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా వృత్తి విద్యా శిక్షణపై తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ భవిష్యత్‌కు పునాది వేసుకోవాలన్నారు. లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే విజయం సొంతం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు, శిక్షకులు కీర్తి, దామోధర్, తదితరులు పాల్గొన్నారు.

మంగుళూరులో మత్స్యకారుడి మృతి



మృతుడు ఎర్రయ్య (ఫైల్)

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు మంగళూరులో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బెవర ఎర్రయ్య (33) కొంత కాలం కిందట బతుకుదెరువు కోసం మంగుళూరు వెళ్లాడు. అక్కడ చేపల వేట చేస్తుండగా.. అస్వస్థతకు గురవ్వడంతో వెంటనే సహచరులు ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశాడు. మృతుడికి భార్య పోలేసు, పిల్లలు రాజు, సాయికిరణ్, లావణ్య ఉన్నారు. మృతదేహాన్ని చింతపల్లి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.

పైడితల్లి ఉత్సవాల్లో కార్పొరేషన్ సేవలు

విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లి తొలేళ్ల, సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ చోట్ల బయో టాయిలెట్లు, తాగునీటి పంపిణీ కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసినట్లు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో 120 బయో టాయిలెట్లు, 33 చోట్ల తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే భక్తుల రద్దీని బట్టి ఎక్కడికక్కడ వాటర్ ట్యాంకులతో మంచినీటి పంపిణీ కూడా చేపడుతున్నామని చెప్పారు. ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద నిర్వాహకులు విస్తరాకులు, పేపర్‌ప్లేట్లు వినియోగించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు 430 మంది అదనపు సిబ్బందిని నియమించామన్నారు.



బయో టాయిలెట్లు

బ్రాహ్మణులకు అవకాశం కల్పించండి



ఎమ్మెల్యే అదితి, కిమిడి నాగార్జునలను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

విజయనగరం రూరల్: బ్రాహ్మణ సామాజిక వర్గానికి దేవాలయాల పాలకమండళ్లలో అవకాశం కల్పించాలని టీడీపీ పార్లమెంట్ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడు రాకేష్‌శర్మ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి గజపతి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునలను సన్మానించారు. కార్యక్రమంలో ధనాల వెంకటరావు, వేణు, మర్ల రవి, తాతా రామారావు, ద్వారకా వాసు, నందగిరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు